తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం అసిఫాబాద్
మహబూబాబాద్

మంగళవారం
21 ఏప్రిల్ 2026

పేజీలు - 8

# రైతు సంక్షేమమే మా విధానం



## కాంగ్రెస్‌కు నినాదం కాదు.. విధానం ముఖ్యం

- నస్తూర్‌పల్లి సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైతు సంక్షేమమే మా విధానమని, కాంగ్రెస్‌కు నినాదం కాదు.. విధానం ముఖ్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు ఉత్సవాల్లో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరుపల్లెలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ప్రజా పాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలని జీవన్‌రెడ్డి అంటున్నాడని, ఆయనకు మంత్రి పదవి ఇవ్వకపోతే ప్రజా పాలన పోవాల్సిందేనా అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రజలు గడీల పాలన వద్దనుకుని కాంగ్రెస్ పాలన తెచ్చుకున్నారని తెలిపారు. ప్రజా పాలన ఎందుకు పోవాలో మిగతా 8లో..





## జిల్లా ఉన్నత విద్యారంగంపై నిర్లక్ష్యం వీడాలి

- అడిషనల్ కలెక్టర్‌కు 'ఆప్' ఆధ్వర్యంలో వినతి

**నిర్మల్ ఏప్రిల్20 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పీజీ కళాశాలను పునరుద్ధరించాలని మరియు బాసరలో ప్రభుత్వం ప్రకటించిన నూతన యూనివర్సిటీ పనులను వేగవంతం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మరియు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ జిల్లాలోని ఒకప్పుడు కళకళలాడిన కాకతీయ యూనివర్సిటీ పీజీ సెంటర్‌ను కొందరు అధ్యాపకుల స్వార్థ ప్రయోజనాల కోసం క్రమంగా మూసివేసేలా కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం అక్కడ భవనం మాత్రమే మిగిలిందని, విద్యా కార్యకలాపాలు సున్నా అని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో మాత్రం అన్ని సౌకర్యాలు ఉన్నట్లు తప్పుడు సమాచారం చూపిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే జిల్లాలో ఏటా సుమారు 4,000 మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేస్తున్నారని, స్థానికంగా పీజీ సౌకర్యం లేకపోవడంతో పేద విద్యార్థులు, ముఖ్యంగా ఆడపిల్లలు పైచదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా వారు కూలి పనులకు లేదా తక్కువ జీతాల ప్రైవేటు ఉద్యోగాలకు వెళ్లాల్సి మిగతా 8లో..

## ప్రజావాణిలో 139 దరఖాస్తులు స్వీకరణ



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 20(జనం సాక్షి) :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీఓ సుమలు పాల్గొని ప్రజల నుంచి 139 వినతిపత్రాలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కి మొత్తం 139 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 54, పీడీ హౌసింగ్‌కు 21, జీడబ్ల్యూఎంసీ (వరంగల్)కు 18 దరఖాస్తులు కాగా, మిగతా శాఖలకు సంబంధించినవి 46 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేయడం జరిగిందని, వాటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలపై కీలక ప్రకటనలు

**కాటారం, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** కాటారం మండలం నస్తూరుపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు స్కిల్ డెవలప్మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, యువతకు తగిన శిక్షణ అందించే చర్యలు చేపడతామని చెప్పారు. కాళేశ్వరంలో రూ.3 కోట్ల వ్యయంతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నామని, అలాగే మంథని మండలం ఆనందపల్లి - కాటారం మండలం దామరకుంట గ్రామాల మధ్య రూ.2003 కోట్లతో హై లెవెల్ వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పట్టాలు లేని రైతులకు భూ పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తాగునీరు, సాగునీరు అందించేందుకు



చిన్న కాళేశ్వర ప్రాజెక్టు పనులను త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మంథని నియోజకవర్గ కేంద్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మరో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్) ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

## అంతర్నిలో అగ్నిప్రమాదం

- చేతికొచ్చిన మొక్కజొన్న పంట దగ్ధం

వార్త మెయిన్ 7లో

## మహిళల అభ్యున్నతికి ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి సీతక్క

వార్త మెయిన్ 3లో



# వేసవిలో మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్ళవద్దు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ



**చెన్నారావుపేట, ఏప్రిల్ 20 ( జనం సాక్షి):** ఎండ తీవ్రత బాగా ఉండే మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు, రైతు కూలీలకు, హమాలీ కార్మికులకు కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్న వారికి ఎండ తీవ్రతల గురించి అవగాహన కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్లే వారు గొర్రెల కాపరులు, పశువుల కాపరులు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్లే వారు కూడా మధ్యాహ్న ప్రయాణాలు చేయకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వెళ్లాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ఉప కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భద్రయ్య, హెల్త్ సూపర్ వైజర్ రామేల్, వైద్య సిబ్బంది లింగమూర్తి, సురేందర్, ఆశా కార్యకర్త అనిత, తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 20 (జనం సాక్షి) :**హనుమకొండ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులతో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు జిల్లా కలెక్టర్ ఎన్. రవి వినతులను స్వీకరించారు. ప్రజల వినతులను అందిస్తూ సమస్య గురించి కలెక్టర్, అదనపు కలెక్టర్లకు తెలియజేయగా వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, గృహనిర్మాణ, మున్సిపల్, తదితర శాఖలకు సంబంధించి 129 అర్జీలు కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా వడగాలుల బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పక్షులు పశుసంపదకు కూడా నీటి వనరులు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ పరకాల ఆర్డీఓ లు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, జడ్పీ సీఈవో శేషాద్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు హెల్త్ కార్డుల పంపిణీ

## డాక్టర్ రఫీ

**మహముత్తారం ఏప్రిల్ 20 (జనం సాక్షి)**మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల మహాముత్తారం లో సోమవారము పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేరి ప్రభాకర్ అధ్యక్షతన ప్రముఖ డాక్టర్ రఫి సహకారంతో నవీన్ నాయక్ కృషితో 90 మంది విద్యార్థులకు హెల్త్ కార్డు పంపిణీ చేశారు. విద్యార్థులకు హెల్త్ కార్డు ఇచ్చిన డాక్టర్ రవి గారికి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు లుఏ, తిరుపతి,ఎం,కవిత, ఎస్,అపర్ణ, ఏ,శారద, బి,శ్యామల పాల్గొన్నారు.



# పుస్తకాలు ముందు తరాలకు జ్ఞాపికలు

## ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 20 (జనం సాక్షి) :**హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చరిత్ర విభాగానికి చెందిన తాత్కాలిక అధ్యాపకుడు డాక్టర్ ఆరూరి రంజిత్ రచించిన "ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం 1956 నుండి 2014 వరకు" అనే పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ పుస్తకాలు సమాజానికి జ్ఞాన సంపదగా నిలుస్తాయని, భవిష్యత్ తరాలకు అవి చిరస్మరణీయ జ్ఞాపికలుగా మారుతాయని తెలిపారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా ఉపయోగంలోకి వచ్చి, గూగుల్ వంటి వనరుల ద్వారా సమాచారం సులభంగా పొందడం అలవాటుగా మారిందని పేర్కొన్నారు. అయితే పుస్తకాల ద్వారా పొందే లోతైన అవగాహన, విశ్లేషణాత్మక దృష్టి ప్రత్యేకమైనవని వివరించారు.డాక్టర్ ఆరూరి రంజిత్ రచించిన ఈ గ్రంథం 1956 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యా విధాన పరిణామాలను సమగ్రంగా ప్రతిబింబిస్తుందని, విద్యా రంగంలో మార్పులు, సంస్కరణలు, విధానాల ప్రభావం వంటి అంశాలను విశ్లేషణాత్మకంగా చర్చించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, అధ్యాపకులు డాక్టర్ బిక్షపతి, డాక్టర్ ఆర్. ఆది రెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ చందూలాల్, పుస్తక రచయిత డాక్టర్ ఆరూరి రంజిత్ పాల్గొన్నారు.

# వేసవికాలంలో జాగ్రత్తలు పాటించాలి



**నల్లబెల్లి, ఏప్రిల్ 20 (జనంసాక్షి):** వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆచార్య సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతు న్నందున మధ్యాహ్న సమయాల్లో ఎవరు ఇంటి నుండి బయటకు రావద్దన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు రావద్దన్నారు. ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత బయటికి వెళ్లి పనులు చేసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన లేదా డయేరియా లాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య లను సంప్రదించి తగిన చికిత్స పొందాలన్నారు. వారు చెప్పే సలహాలు సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. సాధ్యమై నంతవరకు మసాలాలతో కూడిన మాంసాహారాన్ని తగ్గించి ఓఆర్ఎస్, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. రోజు కు నాలుగు నుండి ఐదు లీటర్ల వరకు మంచినీటిని త్రాగాల న్నారు.వేసవిలో కాటన్ దుస్తులను ధరించాలని సూచించారు.

# ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**బెల్లంపల్లి, ఏప్రిల్ 20, (జనంసాక్షి)**బెల్లంపల్లి పట్టణంలోని టీఎన్టీయూసీ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరామ్ సింగ్ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాదును హైటెక్ సిటీ హబ్ గా మార్చి లక్షలాదిమందికి తెలంగాణలో ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుదే అన్నారు. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాన్ని ప్రసాదించాలని ఆయన సేవలు ఇరు తెలుగు రాష్ట్రాలకు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దెల నారాయణ, బొల్లు మల్లయ్య, గజ్జె దుర్గయ్య, అలువాల కుమార్, ఎస్కె అస్గర్ బాషా, మోసాడి గోపాల్, బి సత్యనారాయణ, ఆర్ గంగాధర్ గౌడ్, బి కుమార్, ఎం రాజయ్య, పుల్లూరి పోశం పాల్గొన్నారు.

# కుల గణనలో గంగపుత్రులకు అన్యాయం



**బెల్లంపల్లి, ఏప్రిల్ 20, (జనంసాక్షి)**ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన జాబితాలో గంగపుత్ర సంఘం పేరు లేకపోవడం దారుణమని బెల్లంపల్లి పట్టణ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు వంగల చక్రపాణి, కార్యదర్శి దామెర విజయ్ మాజీ అధ్యక్షుడు బాసబోయిన పోతరాజులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీఏ జాబితాలో తమ సంఘం మొదటి సీరియల్ నెంబర్ లో అధికారికంగా ఉన్నప్పటికీ కులగణనలో లేకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఉండే అగ్నికుల క్షత్రియ అనే జాబితాలో గంగపుత్రులను చేర్చారని అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ ఫిషరీస్ కోపరేటివ్ చైర్మన్ మెట్టు సాయికుమార్ స్పందించి తమ సంఘాన్ని కులగణన జాబితాలో చేర్చే విధంగా కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో గంగపుత్ర కులస్తులందరూ రాష్ట్రవ్యాప్తంగా ఏకమై నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దామీర సదానందం, ప్రధాన కార్యదర్శి మాదరబోయిన మల్లేష్, కోశాధికారి పెద్దపల్లి రామస్వామి, మాజీ ఉపాధ్యక్షుడు బాసబోయిన యుగేందర్, కార్యవర్గ సభ్యులు జీదుల రాములు, మాదరబోయిన గోపాల్, ముద్రగడ వెంకటి, పెద్దపల్లి మల్లయ్య, గరిగె రాజ్ కుమార్, రాసకట్ల శంకర్, జీదుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 20, (జనంసాక్షి)**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటన, బహిరంగ సభకు బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్, నెన్నెల, బిమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో తరలి వెళ్లారు. బెల్లంపల్లి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ, కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, తాండూర్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఈసా, నెన్నెల మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, బిమిని మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ, కన్నెపల్లి మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయులు, వేమనపల్లి మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ముఖ్యమంత్రి సభకు బయలుదేరారు.



# ఆదివాసీ నాయకపోడుల అస్తిత్వ పోరాటం

## తప్పుడు జనాభా లెక్కలపై కలెక్టరేట్ వద్ద బారి నిరసన



**నిర్మల్, ఏప్రిల్ 20 జనం సాక్షి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ మాధ్యమాల ద్వారా వెల్లడించిన జనాభా గణాంకాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయంటూ ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం శంఖారావం పూరించింది. తమ జాతి ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా ఉన్న ఈ గణాంకాలను తక్షణమే సవరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించిన ప్రతినిధులు, ప్రభుత్వ సర్వేల్లో దొర్లిన తప్పిదాలను ఏకరువు పెట్టారు.

ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఆరు లక్షల మంది ఉన్న నాయకపోడుల జనాభాను కేవలం పదహారు వేలుగా చూపడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక్క నిర్మల్ జిల్లాలోనే సుమారు 45 వేల మందికి పైగా జనాభా ఉన్నప్పటికీ, అధికారిక గణాంకాల్లో ఇంతటి వ్యత్యాసం ఉండటం వెనుక ఉన్న సాంకేతిక లోపాలను వారు ఎత్తిచూపారు. షెడ్యూల్డ్ తెగల జాబితాలోని సీరియల్ నంబర్ 6 లో గోండు, రాజగోండ్, నాయకపోడ్ వంటి వివిధ తెగలను కలిపి ఉంచడం వల్ల క్షేత్రస్థాయిలో జనాభా లెక్కింపు సక్రమంగా జరగడం లేదని, దీనివల్ల తమ ప్రత్యేక అస్తిత్వం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్వతంత్రంగా ఉన్న తమ తెగను ఇతరులతో కలిపి చూపడం వల్ల ప్రభుత్వ రికార్డుల్లో వాస్తవ గణాంకాలు నమోదు కావడం లేదని వారు స్పష్టం చేశారు.

జనాభా ప్రాతిపదికన అందాల్సిన విద్యా, ఉద్యోగ అవకాశాలు మరియు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఈ తప్పుడు లెక్కల వల్ల తమకు అందకుండా పోతున్నాయని నాయకులు ఆరోపించారు. రాబోయే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ జనగణనలో సీరియల్ నంబర్ 6 లోని ప్రతి తెగకు విడివిడిగా ప్రత్యేక కాలమ్‌లను కేటాయించి, వాస్తవ జనాభా వివరాలను సేకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సర్వేలోని లోపాలను తక్షణమే సవరించి, అధికారిక రికార్డులలో మార్పులు చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తమ న్యాయమైన హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకపోడు ప్రతినిధులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంక గారి భూమయ్య, స్టీరింగ్ కమిటీ కన్వీనర్ సురపు సాయన్న, సాకి లక్ష్మణ్,మంద మల్లేష్,సుంచు శ్రీనివాస్, అర్జున్ లింగన్న, శివ శంకర్,బోసని రాజేశ్వర్,గుమ్ముల శ్రీనివాస్,పుష్పుర్,సర్పంచ్ నర్సన్న, సర్పంచ్ తిరుపతి,దినేష్, గణేష్,పోతురాజు శ్రీనివాస్, లింగల శ్రీనివాస్,శ్రీకాంత్, సాయికృష్ణ, ప్రభాకర్,బచ్చన్,ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్మల్‌లో కోతుల బెడుదకు చెక్

## పట్టివేత ఆపరేషన్ ప్రారంభం



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్20,(జనంసాక్షి)** నిర్మల్ పట్టణంలో గత కొంతకాలంగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల సమస్యకు మున్సిపల్ శాఖ ఎట్టకేలకు పరిష్కార దిశగా కీలక చర్యలు ప్రారంభించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు, పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మున్సిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో సోమవారం కోతుల పట్టివేత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని పలు కాలనీలలో కోతుల అల్లరి రోజురోజుకు పెరుగుతూ ప్రజల జీవనానికి అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో, ప్రత్యేకంగా కోతులను పట్టే నిపుణులను పిలిపించి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం విశేషం. కోతులను సురక్షితంగా పట్టుకుని, వాటిపై ప్రత్యేక రంగులు చల్లి, సమీపంలోని కావ్వాల్ అటవీ ప్రాంతానికి తరలించనున్నారు. ఈ రంగులు చల్లడం వెనుక ఉద్దేశ్యం కూడా స్పష్టమే. ఒకవేళ కోతులను పట్టణ శివారులో లేదా దగ్గర ప్రాంతాల్లో వదిలిపెడితే, అవే కోతులని సులభంగా గుర్తించేలా ఈ గుర్తింపు చర్యలు చేపడుతున్నారు. దీంతో సమస్య తిరిగి ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని, చాలా త్వరలోనే నిర్మల్ పట్టణ ప్రజలు కోతుల బెడద నుంచి పూర్తిగా విముక్తి పొందుతారని వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి వెల్లడించారు.

## ఉపాధి హామీ కూలీలకు బిస్కెట్లు, మజ్జిగ, తాగునీటి పంపిణీ



**తాండూర్, ఏప్రిల్ 20( జనం సాక్షి)**మంచిర్యాల జిల్లా :తాండూర్ మండలం లో రాజీవ్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న కూలీలకు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కల్పించే ఉద్దేశంతో సర్పంచ్ మామిడాల లలిత--రాజేశం ఆధ్వర్యంలో బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు మరియు తాగునీరు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో పనిచేస్తున్న కార్మికులు వడదెబ్బకు గురికాకుండా ఉండాలని, తరచూ నీరు, మజ్జిగ తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొని కార్మికులతో మాట్లాడారు. ప్రభుత్వం కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, మధ్యాహ్నం వేళల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బడిబాటలో చైతన్యం ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచుదాం

## నెన్నెల్, సర్పంచ్ ఇబ్రహీం



నెన్నెల్, ఏప్రిల్ 20( జనం సాక్షి)నెన్నెల్, మండలం నెన్నెల్ గ్రామ పరిధిలోని దుబ్బపల్లి ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరుడు ఇబ్రహీం, మండల విద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మధుమోహన్ కలిసి కరపత్రం, పోస్టర్‌ను విడుదల చేశారు. సర్పంచి ఇబ్రహీం గ్రామ అభివృద్ధి పట్ల ఎల్లప్పుడూ కృషి చేస్తూ, విద్యా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ముందుండే నాయకుడిగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన పెద్దలు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న కార్యక్రమాలు ఆనందదాయకమని, అడ్మిషన్లు పెంచడంలో తాము కూడా తోడ్పాటు అందిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవన్ స్థలాన్ని కాపాడండి

## మున్సిపల్ చైర్పర్సన్‌కు వినతి



**బెల్లంపల్లి, ఏప్రిల్ 20, (జనంసాక్షి)**బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ భవన్ స్థలం కబ్జాకు గురవుతుందని, కాపాడాలని కోరుతూ సోమవారం దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మున్సిపల్ ఛైర్పర్సన్ దావ స్వాతి రమేష్ కు వినతిపత్రాన్ని అందజేశారు. అంబేద్కర్ భవన్ స్థలం, ఫంక్షన్ హాల్ ఆక్రమించి, అక్రమంగా వ్యాపారం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ భవన్ స్థలం వద్ద కబ్జాలను తక్షణమే ఖాళీ చేయించాలని అన్నారు. అసంపూర్తిగా, మధ్యలోనే ఆగి పోయిన అంబేద్కర్ ఫంక్షన్ హాల్ ను పూర్తి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు కుంభాల రాజేష్, ప్రధాన కార్యదర్శి రత్నం ఐలయ్య, పట్టణ కోశాధికారి గొడిసెల శ్రీహరి, గౌరవ సలహాదారులడు కామెర దుర్గయ్య, ముఖ్య సలహాదారులు దాసరి భానయ్య, బొంకురి రామచందర్, పట్టణ ఉపాధ్యక్షులు సుంకిత సమ్మయ్య, కుష్ణ పెల్లి రాజలింగు, బందెల మురళి, గొడిసెల చంద్ర మొగిలి, పట్టణ కార్యదర్శులు పైడిమల్ల చంద్ర శేఖర్, నాతరి కిరణ్, గజ్జల రాంనాథ్, సభ్యులు అంగూరి సుభాష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**శ్రీ మహాత్మ బసవేశ్వర 892వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై, మహాత్మ బసవేశ్వర జీవితం, సూత్రాలు, సమానత్వం, సామాజిక న్యాయం పై చేసిన కృషిని కొనియాడారు. సమాజంలోని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, బిసి సంక్షేమ అధికారి ఇందిర, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి క్రాంతి కిరణ్, బీసీ సంఘాల ప్రతినిధులు కంపాటి రాజయ్య, మాటూరి శ్రీనివాస్, రుద్రశెట్టి యుగేందర్, మాటూరి మంజుల, శివ దర్శనం, సతీష్, జిల్లాలోని వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ ,ఏప్రిల్,20,(జనంసాక్షి)** మామడ మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ కనీస మద్దతు ధర 2400/- ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న పంట సాగు అధికంగా ఉన్న కారణంగా ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి ఇప్పటికే మండల కేంద్రాలతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో సబ్ సెంటర్ లు సైతం మంజూరు చేసుకున్నామన్నారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు రంజిత్, గ్రామ సర్పంచ్ సురేందర్, మండల సీనియర్ నాయకులు బాపురెడ్డి, తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసిన డాక్టర్ మనోజ్



**చిట్యాల,ఏప్రిల్ 20( జనం సాక్షి):** జాతీయ ఉపాధి హామీ కూలీలు ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు డాక్టర్ మనోజ్ వివరించారు. చిట్యాల సామాజిక వైద్యశాల సూపరిండెంట్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో జాతీయ ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీలకు ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు డాక్టర్ మనోజ్. నర్సింగ్ సూపరిండెంట్ సరోజిని, నర్సింగ్ ఆఫీసర్ శిరీష, ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీలు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకే పని చేయాలన్నారు.సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు మాత్రమే పని చేయాలని, తలపై టవలు కట్టుకోవాలి. ఎక్కువ మోతాదులో వాటర్ తాగాలి. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, తీసుకోవాలి, కిరాణం షాపులో మెడికల్ షాప్ లో డబ్బాలో దొరికే ఓఆర్ఎస్ కాకుండా ప్యాకెట్ లో వచ్చే ఓ ఆర్ఎస్ వాడాలని పలు జాగ్రత్తలు తెలిపారు. అనంతరం కూలీల ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది కట్కూరి నరేందర్. ఉప్పుల కిరణ్. కారోబార్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ రక్షణకు ఉద్యమించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య



**చెన్నారావుపేట, ఏప్రిల్ 20 ( జనం సాక్షి ):** ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడం కోసం వ్యవసాయ కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో వ్యవసాయ కార్మిక సంఘం చెన్నారావుపేట మండల 6వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ఉపాధి హామీకి సరైన నిధులు కేటాయించకుండా వ్యవసాయ కూలీలు, కార్మికుల పట్ల సవితి తల్లి ప్రేమ చూపిస్తుందని ఆయన అన్నారు.గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశంలో సరైన సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణకై ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులురాలుగా బుడిగె యాదమ్మ, కార్యదర్శిగా బూలె చంద్రకళ, ఉపాధ్యక్షులుగా మండల స్వరూప, మూగల సారమ్మ, సహాయ కార్యదర్శిలుగా మాదాసి కల్పన, ఎస్కే సైదా, తప్పెట రమేష్, చిలువేరు కలమ్మలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నవీన్ల స్వామి, మహిళ కూలీల జిల్లా కన్వీనర్ మొగులోజు శారద, నారాయణ, వ్యవసాయ కూలీలు, పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడ గ్రాడ్యువేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సరోజన

**శాయంపేట ,ఏప్రిల్ 20 (జనం సాక్షి)**శాయంపేట మండలం తహరాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం సందర్భంగా గ్రాడ్యువేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రం ఆవరణలో ఘనంగా ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కుక్కల సరోజన హాజరై పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ పుణ్యవతి మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని, గర్భిణీ స్త్రీల నుంచి పుట్టిన పిల్లల వరకు సరైన పోషణ అందించాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం పిల్లలకు యూనిఫారాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావుల శ్రీనివాస్, ప్రీ స్కూల్ ట్రైనర్ రిజ్వానా, హైస్కూల్ హెడ్ మాస్టర్ రమేష్, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ సదాకర్, చలి వాగు ప్రాజెక్ట్ డైరెక్టర్ కుక్కల తిరుపతి సెక్టార్ టీచర్లు మరియు ఆయాలు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి ముదిరాజ్ పెద్దలను కలిసిన పాపయ్యపేట ముదిరాజ్‌లు



**చెన్నారావుపేట, ఏప్రిల్ 20 ( జనం సాక్షి):** మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల పెద్దలు మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ సహకారంతో రాష్ట్ర స్థాయి ముదిరాజ్ పెద్దలు ఈటల రాజేందర్ ముదిరాజ్, బండా ప్రకాష్ ముదిరాజ్, నీలం మధు ముదిరాజ్, కాసాని వీరేష్ ముదిరాజ్ లను హైదరాబాద్ లోని వారి నివాసాల్లో కలిశారు.ఈ సందర్భంగా పాపయ్యపేట ముదిరాజ్ కుల పెద్దలు ఉప్పరి చిన్న స్వామి, సొసైటీ అధ్యక్షులు హంస చంద్రయ్య ముదిరాజ్ లు మాట్లాడుతూ పాపయ్యపేట గ్రామంలోని పలు సమస్యలను ముదిరాజ్ పెద్దల దృష్టికి తీసుకురాగా వారు సానుకూలంగా స్పందించారని అన్నారు. పాపయ్యపేట ముదిరాజ్ కులస్తులను ఈటల రాజేందర్, నీలం మధు, కాసాని వీరేష్ ముదిరాజ్ లకు పరిచయం చేసిన మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ చైర్మన్ ఉప్పరి వీరస్వామి, అన్నెబోయిన అనిల్ ముదిరాజ్ లు మాట్లాడుతూ ఈటెల రాజేందర్, నీలం మధు, కాసాని వీరేష్ ముదిరాజ్ లు మా గ్రామానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారని వీరందరిని కలవడం సంతోషంగా ఉందని సమయం వెచ్చించి మాట్లాడిన ముదిరాజ్ పెద్దలకు పాపయ్యపేట ముదిరాజ్ కులస్తులందరి తరుపున, మెపా పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాపయ్య పేట ముదిరాజ్ కుల పెద్దలు ఉప్పరి చిన్న స్వామి, మాజీ సొసైటీ ఉప్పరి కొమురయ్య, పెద్దమ్మ తల్లి ఆలయ చైర్మన్ ఉప్పరి వీరస్వామి, కుల సభ్యులు అన్నెబోయిన అనిల్, ఉప్పరి నర్సింహస్వామి ముదిరాజ్ లతో పాటు మెపా సభ్యులు పాల్గొన్నారు.

## అన్ని వసతి గృహాలలో ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేయాలి



**గూడూరు,ఏప్రిల్20(జనంసాక్షి)**మండలంలోని అన్ని వసతి గృహాలలో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయాలని మానుకోట జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20నుండి 26 వరకు వారం రోజులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని వసతి గృహాలు సంక్షేమ విద్యాసంస్థలలో సంక్షేమ వారోత్సవాలు ప్రారంభమ య్యాయి.సోమవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు శివారు మర్రిమిట్ట మహాత్మజ్యోతిరావు పూలే వసతిగృహాన్ని (బాలికలు)సందర్శించి, ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొని పిల్లలతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మహాత్మ జ్యోతిరావు పూలే వసతి గృహంలో పరిసరాలను పరిశీలించారు,ఈ వారం రోజులలో ప్రతిరోజు ఒక థీమ్ ద్వారా వసతి గృహాలలో సానిటేషన్,మైనర్ రిపేర్,హెల్త్,స్టోర్ పరిసరాల పరిశుభ్రత తదితరఅంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు,వసతి గృహంలోని స్టోర్ గది, తరగతి గదులు,కిచెన్, డైనింగ్ హాల్,మరుగుదొడ్లు, లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత వసతి గృహాల సిబ్బందిని ఆదేశించారు.భోజనం సిద్ధం చేసే సిబ్బంది కి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.అన్ని వసతి గృహాలలో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు.విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు,డైట్ మెనూ ప్రకారం పక్కాగా నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలని,విద్యతోపాటు క్రీడా మానసిక వికాసం తదితర అంశాలపై శిక్షణ ఇప్పించాలని,సమ్మర్ క్యాంపు ల ద్వారా పిల్లలకు క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించాలన్నారు.పిల్లల యొక్క విద్యాసామర్ధ్యాలను స్వయంగా పరిశీలించారు. నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ తరగతుల ద్వారా అత్యాధునిక వినూత్న రీతిలో విద్యాబోధనలు అందించాలని ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులకు సూచించారు.అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని,ఈ వారం రోజులు అన్ని విద్యాసంస్థలలో రోజువారి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుండి ఏప్రిల్ 26 వరకు వారం రోజులు జిల్లాలో సంక్షేమ వారోత్సవాలను నిర్వహించడం కోసం ఇప్పటికే పక్కా ప్రణాళికతో ప్రతి ఒక్కరికి వసతి గృహాలు హాస్టల్స్,విద్యాసంస్థలను కేటాయించడం జరిగిందని తెలిపారు.కలెక్టర్ వెంట గూడూరు తాసిల్దార్ నాగభవాని,ఎంపీడీవో సత్యనారాయణ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**పాలకుర్తి, ఏప్రిల్ 20(జనంసాక్షి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కేక్కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జెల్లి (ల్యాబ్) వెంకన్న మాట్లాడుతూ దేశంలో చంద్రబాబు లాంటి గొప్ప నాయకుడు ఎవరూ లేరని కొనియాడారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేసిన గొప్ప నాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా, మండల నాయకులు గణపురం ఎల్లయ్య, రాంరెడ్డి, పసులాది ఉపేందర్. గుగులోతు రమేష్. తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వెంచర్స్ పై చర్యలు తీసుకోవాలి



**బచ్చన్నపేట ఏప్రిల్ 19 ( జనం సాక్షి):** బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేటలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వెంచర్స్ పై చర్యలు తీసుకోవాలని టీపీసిసి కన్వీనర్ జంగిటి నరేష్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బచ్చన్నపేట మండలంలోని పోచ్చన్నపేట గ్రామపం చాయతీలో రియల్ ఎస్టేట్ వెంచర్లు చేస్తూ బ్రోకర్లు విచ్చలవిడిగా నిబంధనలు తుంగలో తొక్కి ఎలాంటి పర్మిషన్ లేకుండా డిటి సిపి ద్వారా తీసుకున్న నిబంధనలు పాటించకుండా అక్రమార్గమే ధ్యేయంగా ప్రజలను నిండా ముంచుతూ వివిధ రకాల అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నా వారి పైన తక్షణమే చర్యలు తీసుకొని వాటికి సహకరిస్తున్న కొంతమంది అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ అసిస్టెంట్ కలెక్టర్ షాలోమ్ ని విచారణ అధికారిగా నియమిస్తానని కలెక్టర్ తెలిపారని అన్నారు

## ఈ నెల 22న సిపిఐ(ఎంఎల్)పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి



**గూడూరు,ఏప్రిల్20(జనంసాక్షి):** ఈ నెల 22 మార్క్సిస్టు మహో ఉపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ 156వ,జయంతిని మరియు సిపిఐ( ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవానికి తరలి వచ్చి విజయవంతం చేయాలని సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసి మండల కార్యదర్శి గజ్జి లింగన్న పిలుపునిచ్చారు.సోమవారం గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా గజ్జి లింగన్న హాజరైనారు.ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ముందు భారత దేశ విముక్తికై, పీడిత ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకై,వర్గ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా 1969 లో సిపిఐ(ఎంఎల్) ఆవిర్భవించిందన్నారు. ఆదివాసీలు,గిరిజనులు పేద అట్టడుగు వర్గాలను అణచివేసి దేశ సంపదను లూటీ చేయడానికి వ్యతిరేకంగా అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించారని అన్నారు.దేశంలో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా నాటి నుండి నేటి వరకు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రతిఘటన పోరాట సిద్ధాంత వెలుగులో అనేక పోరాటాలను కొనసాగించిందన్నారు. కామ్రేడ్ లెనిన్ స్ఫూర్తితో వర్గ రహిత సమాజ నిర్మాణం కోసం భూమి,బుక్తి,విముక్తి కోసం నూతన ప్రజాస్వామిక విప్లవమే లక్ష్యంగా పోరాడి అనేకమంది తమ విలువైన ప్రాణాలను అర్పించారన్నారు. భూస్వామ్య పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద కూటమికి అశేష ప్రజలకు ఉండే వైరుధ్యమే ప్రధాన వైరుధ్యమని గుర్తించి దానికి నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గమని గుర్తించాలని,అందుకోసం కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి రూపొందించి అమలు చేసిన ప్రతిఘటన పోరాట పంథాయే మనందరికీ ఆచారనాత్మకం కావాలని వారు అన్నారు. ప్రస్తుతం దేశంలో అధికారంలో ఉన్న మతోన్మాద పాసిస్టు బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ మతం ముసుగులో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతున్నాడని,దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి అనేక చట్ట సవరణలకు పూనుకున్నాడని,అగ్రరాజ్యం పేరుతో అమెరికా ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ పై చేస్తున్న దురాక్రమణ దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఈ నెల 22న పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా గూడూరు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగే జెండా ఆవిష్కరణకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.అదేవిధంగా గ్రామ గ్రామాన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో లి(కామ్రేడ్ సూర్యం సిపిఐ(ఎం ఎల్)న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి)లి జిల్లా నాయకులు పుల్లన్న, శ్రీశైలం, తిరుపతక్క, కొటెం అచ్చన్న, వజ్జయ్య, సమ్మయ్య, కాడబోయిన నరసయ్య, అద్దూరి వెంకన్న, లక్ష్మి, కవిత, సునీత, భద్రక్క,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలను అభినందించిన తహసిల్దార్



**పర్వతగిరి,ఏప్రిల్ 21,(జనంసాక్షి)** పర్వతగిరి మండల కేంద్రంలో ని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం లో ఇంటర్మీడియట్ ఎం ఎల్ టి (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్)గ్రూప్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిలను పర్వతగిరి మండల తహసిల్దార్ టి.వెంకటస్వామి అభినందించారు. సోమవారం రోజు కస్తూర్బా గాంధీ పాఠశాల/కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చెన్నూరి వైష్ణవి 481/500, వర్ధోలు కల్పన 481/500,చిర్ర లాస్య 462/500 మార్కులు సాధించారు. విద్యార్థినులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రారంభమైన మొదటి సంవత్సరం లో 88 శాతం ఉత్తీర్ణతను సాధించినందుకు గాను కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా నీ బోధన సిబ్బంది గుగులోత్ పద్మ,బత్తుల పద్మావతి లను అభినందించారు.ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా మాట్లాడుతూ తమ కళాశాలలో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించబడుతుందని వచ్చే విద్యాసంవత్సరం తమ కళాశాలలో ఏం ఎల్ టి గ్రూప్ లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.వచ్చే విద్యాసంవత్సరానికి నూరు శాతం ఉత్తీర్ణతను సాధించడానికి ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తామని అన్నారు

## ప్రజాపాలనలోనే రైతుల సంక్షేమం



**పరకాల, ఏప్రిల్ 20 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే రైతుల సంక్షేమం అమలవుతుందని కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు, 19వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం రోజున పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు తరలి వెళ్లారు. కొయ్యడ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి నిరుద్యోగులకు, పేద బడుగు బలహీన వర్గాలకు, రైతులకు రైతు కూలీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 16 వార్డ్ కౌన్సిలర్ బండి శ్రీధర్, సమన్వయ కమిటీ సభ్యులు ఒంటేరు శ్రవణ్ కుమార్, స్వామి, బండి రాజు, బండారి జయపాల్, ఎండి షఫీ, గోపి, ఏకు సురేష్, కొయ్యడ కుమార్, సాయి, రమేష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల పాఠ్య మూల్యాంకన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 20 (జనం సాక్షి)** :కాజీపేట ఫాతిమా హైస్కూల్లో కొనసాగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల పాఠ్య మూల్యాంకన (వాల్యువేషన్) ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సోమవారం పరిశీలించారు.ఈ నెల 1వ తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించబడుతున్న మూల్యాంకన కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్, నిర్వహణ విధానం, భద్రతా చర్యలు, పరీక్ష పత్రాల సంరక్షణ వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూల్యాంకనం పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, సమగ్రంగా మరియు బాధ్యతతో పత్రాలను పరిశీలించాలని సూచించారు.ఈ మూల్యాంకన ప్రక్రియను ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సిబ్బంది నిర్వహిస్తున్నందున, సమన్వయంతో, నిర్ణీత మార్గదర్శకాలకు అనుగుణంగా పనులను సమర్థవంతంగా కొనసాగించాలని సూచించారు.మూల్యాంకన కేంద్రంలో అవసరమైన సదుపాయాలు, పర్యవేక్షణ వ్యవస్థ, సమయపాలన వంటి అంశాలను కూడా కలెక్టర్ సమీక్షించారు.ఎటువంటి లోపాలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, ఎగ్జామినేషన్అసిస్టెంట్ కమిషనర్ భువనేశ్వరి దేవి, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్



**చెన్నారావుపేట, ఏప్రిల్ 20 ( జనం సాక్షి):** మండలంలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని శంకరంతండాకు చెందిన ఓ మైనర్ బాలిక ఇటీవల పదవ తరగతి పూర్తి చేసింది. అదే తండాకు చెందిన ఓ యువకుడితో వివాహం జరిపించడానికి పెద్దలు నిశ్చయించారు. మరికొద్ది రోజుల్లోనే వివాహం జరగనుండగా పెళ్లికి ఇరు కుటుంబాలు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారంతో సోమవారం పరిరక్షణ కమిటీ హెల్ప్ లైన్ అధికారులు మౌనిక, కల్పన, చైల్డ్ లైన్ అధికారి మౌనిక, ఐసిడిఎస్ సూపర్వైజర్ వాసంతిలు స్థానిక పోలీసులతో కలిసి ఆ తండాకు చేరుకొని మైనర్ బాలిక తల్లిదండ్రులతో బాల్య వివాహం జరిపిస్తే కలిగే నష్టాలపై వారికి వివరించారు. అదేవిధంగా యువకుడి తండ్రికి సైతం కౌన్సిలింగ్ నిర్వహించి బాల్య వివాహాన్ని నిలిపివేయడం జరిగిందని వారు తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి బర్ల కాపరి మృతి

**లక్ష్మణ చందా, ఏప్రిల్ 20, (జనం సాక్షి)** లక్ష్మణ చందా గ్రామానికి చెందిన కుంచపుల్ల నర్సింలు బర్లు మేపుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రావణి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కుంచపుల్ల నరసింహులు వయసు 68 సంవత్సరాలు కులం వడ్డెర వృత్తి బర్రెల కాపరి అనునతను ఆదివారం రోజున మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో బర్రెల్ని మేపడానికి ఊరు చివరన ఉన్న చెరువునకు వెళ్లి బర్రెల్ని మేపుతుండగా కొన్ని బర్రెలు నీటిలోనికి వెళ్లడం వలన నరసింహులు బర్రెల ను ఒడ్డుకు చేర్చడానికి నీటిలో దిగగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయినాడు. మృతుని యొక్క కుమారుడు కుంచపుల్ల సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణి తెలిపారు.



## ములుగు జిల్లా ఫ్లెక్సీ షాప్ ఫ్లెక్సీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా సలుపాల శ్రీనివాస్



**ములుగు బ్యూరో, ఏప్రిల్20 (జనం సాక్షి):**-ములుగు జిల్లా ఫ్లెక్సీ షాప్ ఓనర్స్ అసోసి యేషన్ ను సోమవారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సలుపాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎండి అలీ,సర్వేష్ (ఏటూరు నాగారం), కార్యదర్శులుగా మాట్ల బద్రి,షరీఫ్,కోశర వేణు (వస్ర),కోశాధికారిగా గద్దం శ్రీను. ప్రచార కార్యదర్శులుగా చంద్రగిరి మురళీకృష్ణ,మాదారపు రాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన సలపాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్లెక్సీ షాప్ నిర్వహణ కోసం ఎన్నో వ్యయ,ప్రయాసలకు ఓర్చి షాపులు నిర్వహిస్తున్నా మని,ప్రస్తుతం ఫ్లెక్సీ ప్రింటింగ్ ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగాయని, పెరిగిన దారులకు అనుగుణంగా మేము కూడా స్వల్పంగా పెంచడం జరిగిందని, దీనికి జిల్లాలోని వినియోగదారులు, ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు. అదేవిధంగా తమ ఎన్నికకు సహకరించిన ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపులో ఓనర్లకు కమిటీ తరఫున కృతజ్ఞత తెలిపారు. ఫ్లెక్సీ షాప్ ఓనర్లు కూడా యూనియన్ విధించిన నిబంధనలకు లోబడి ఫ్లెక్సీలు ముద్రించాలని,ధరలను అమలు చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లాలోని ములుగు వస్ర ఎటునాగారం వంగపేట వాజీ వెంకటాపూర్ మండలాలకు చెందిన ఫ్లెక్సీ షాప్ ఓనర్లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణి

**దస్తురాబాద్, ఏప్రిల్ 20 (జనంసాక్షి)** ::మండలంలోని మున్యాల్ గ్రామంలో సోమవారం ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ సర్పంచ్ కట్కూరి లలితరాజేష్ ఒక మంచి నిర్ణయం తీసుకుని ఉపాధి హామీ పథకం పని ప్రదేశంలో కూలీలు ఎండ దెబ్బకు గురికాకుండా ఉండేందుకు వారికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండలు అధికంగా మండుతున్న వేళ ఉపాధి కూలీల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్,?గ్రామ వార్డు సభ్యులు,?పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

# గిరిజన హాస్టల్ వర్కర్లకు 8 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20(జనంసాక్షి ):**తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్ డైలీవేజ్,ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలోని జిల్లా కలెక్టరేట్ లో డి టి డి ఓ రమాదేవి కీ గిరిజన హాస్టల్స్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా జాయింట్ సెక్రటరీ వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ డైలీవేజ్,ఔట్సోర్సింగ్ వర్కర్ల కు గత 8 నెలలుగా వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని, వేసవి సెలవులు దగ్గర కావస్తున్నప్పటికీ ఇంతవరకు గత ఏడాది సమ్మర్ క్యాంపు వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. గతంలో చేసిన సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని సమ్మె సందర్భంగా గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చేలా చూడాలనీ, లేని పక్షంలో యూనియన్ గా చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు ,హాస్టల్స్, డైలీవేజీ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి అడ శ్యామ్ రావు,జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, జిల్లా నాయకులు కుమ్రం సత్యవతి, కోవ సురేందర్, నైతం మధుకర్,తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి



**తొర్రూరు, ఏప్రిల్ 20 (జనం సాక్షి):**ఈనెల 23న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగే శ్రీ శ్రీ శ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సగర ఉపర సంఘం జిల్లా అధ్యక్షుడు దుంపల సమ్మయ్య సగర పిలుపునిచ్చారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమయం మాట్లాడుతూ సగరులు నివాసం ఉండే ప్రతి గ్రామంలో భగీరథ జయంతి ఉత్సవాలు చేయాలనే లక్ష్యంతో ఈ సంవత్సరం ప్రతి గ్రామానికి భగీరథ మహర్షి చిత్రపటంతో పాటు ఇతర సామాగ్రిని అందజేయడం జరుగుతుందని, కావున గ్రామ, మండల,జిల్లా సంఘాలు ఎక్కడికక్కడ జయంతి ఉత్సవాలను 23వ తేదీన ఉదయం జరుపుకొని మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్ రవీంద్ర భారతి వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సగర ఉపర సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు సోమ రాజశేఖర్ సగర, సంఘం సంయుక్త కార్యదర్శి సోమ హరిప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మార్క రుద్రయ్య, జిల్లా కార్యదర్శి బైన బిక్షపతి, జిల్లా నాయకులు మార్క అరుణ్ కుమార్ సగర, బైన అనిల్, తొర్రూరు,పెద్దవంగర మండల అధ్యక్షులు బైన రమేష్ సగర, దుంపల వేణు సాగర్ సగర, నాయకులు సోమ మల్లేశం, మురళి, రమేష్, శీను, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జన్మదిన వేడుకలు

**శాయంపేట, ఏప్రిల్ 20 (జనం సాక్షి)**శాయంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చి రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆశీస్సులతో నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని అన్నారు. తదనంతరం పలువురు బుచ్చిరెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారపల్లి రవీందర్, చిందం రవి, కొమ్ముల సదానందం, డిటి రెడ్డి, మసికే కుమారస్వామి, అరికెళ్ల సుధాకర్, నాయకులు మామిడిపల్లి సాంబయ్య, గొర్రె కుమారస్వామి, ఏనుగుల అశోక్, అరికిళ్ల రవి, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 20(జనంసాక్షి ):** పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్ నైట్ కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను జాతీయ హరిత దళం రీజనల్ ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్, జిల్లా సమన్వయకర్త కటకం మధుకర్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుండి 30వ తేదీ వరకు చేపట్టిన ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్ నైట్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెలిపారు. భూమి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, నేల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి చర్యలు పర్యావరణానికి దోహదపడతాయని తెలిపారు. నేల పరిరక్షణకు సంబంధించి ముఖ్య సందేశాలు, సేంద్రియ ఎరువుల వినియోగం, సింగిల్ యూత్ ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలను ప్రజలకు వివరించాలని, విద్యార్థులు, యువతలో పర్యావరణంపై చైతన్య పరచడమే లక్ష్యమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మగోవుల సంరక్షణ అందరి బాధ్యత



**తొర్రూరు, ఏప్రిల్ 20 (జనం సాక్షి):**గోవుల సంరక్షణ అందరి బాధ్యతగా మారాలని వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ తొర్రూరు అధ్యక్షులు బిజ్జాల వెంకటరమణ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని వేణుగోపాలస్వామి గోశాల కు వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ తొర్రూరు అధ్యక్షులు బిజ్జాల వెంకటరమణ ఆధ్వర్యంలో రూ.1 లక్ష విరాళంగా అందించారు. గోశాల అవసరాల నిమిత్తం ట్రాక్టర్ కొనుగోలుకై సదరు మొత్తాన్ని వినియోగించనున్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని గోశాలలో రూ.1 లక్ష విరాళాన్ని వెంకటరమణ గోశాల అధ్యక్షులు దారం కుమారస్వామి వర్కింగ్ ప్రెసిడెంట్ కర్రా అశోక్ రెడ్డి గారికి అందజేశారు. గోశాల నిర్వాహకులు దాత వెంకటరమణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ... గోవుల సంరక్షణకు పాటుపడుతున్న స్థానిక గోశాలకు తోడ్పాటు అందించాలనే సంకల్పంతో ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు.ప్రకృతిలోని చెట్టూ చేమా, రాయీ రప్ప, పక్షులు, జంతువులు, మనకు అన్నీ పూజనీయాలే కానీ అగ్రస్థానం మాత్రం గోవుదేనన్నారు. సర్వ దేవతా స్వరూపమే గోవు అని, 33 కోట్ల దేవతలకు నిలయం గోవు శరీరం అన్నది మన నమ్మకమన్నారు. ప్రతి ఒక్కరూ గోవులను పూజించి గోమాత ఆశీస్సులు పొందాలని కోరారు.ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని అనుసరించాలని, గోమాతను పూజించాలని కోరారు. గో సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఐపీసీ ప్రొద్దుటూరు గౌరీశంకర్ , వీడీజీ రామ ఉపేందర్, జెడ్ సీ 3 శ్రవణ్ కుమార్, వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్ కపుల్స్ ప్రధాన కార్యదర్శి నాళ్ళ కృష్ణమూర్తి, కోశాధికారి కొండ్లె చంద్రయ్య, గోశాల ప్రధాన కార్యదర్శి నాల కృష్ణమూర్తి, కోశాధికారి ధార నాగ శివప్రసాద్, భాస్కర్ రెడ్డి, కే నాగేంద్ర చారి, పి. వెంకటేశ్వర్లు, పి. రుద్రదేవ్, డి. ప్రభావతి, టీ. కరుణ శ్రీ, ఎన్. అనసూయ లు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో బసవ జయంతి వేడుకలు



**పాలకుర్తి, ఏప్రిల్ 20 (జనంసాక్షి)** బసవేశ్వరుడు సామ్యవాద సాకారానికి పాటు పడిన సమాజ సంస్కర్త, ఆదర్శ సమాజ నిర్మాణానికి పునాదులు వేసిన పునీతుడని. ప్రముఖ సాహి తీవేత్త, సోమ నాథ కళాపీఠం అధ్యక్షులు డాక్టర్ రాపోలు సత్యనారాయణ అన్నారు. సోమవారం బసవేశ్వరుని 893 వ జయంతి వేడుకలు పాలకుర్తిలోని మహాకవి సోమనాథ స్మృతి వనంలో శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం మరియు సోమనాథ కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుని విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సోమనాథ కళా పీఠం అధ్యక్షులు డాక్టర్ రాపోలు సత్యనారాయణ మాట్లాడారు. ప్రపంచంలో మొదటి పార్లమెంట్ రూపకల్పన చేసింది బసవేశ్వరుడని అన్నారు. సమాజంలో పాతుకు పోయిన మూఢాచా రాలను ధిక్కరించిన హేతువాదని అన్నారు. నేటి రాజకీయాలకు బసవ తత్వం ఆలంబన కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజ్యాంగ నిర్మాణం కూడా బసవేశ్వరుని ఆలోచనా విధానం నుండే రూపకల్పన చేయబడిందని అన్నారు. రాబోయే కాలంలో పాలకుర్తిలో బసవ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. బసవేశ్వరుని సమతాభావన స్ఫూర్తిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలోని లింగాయత్ లను ఏకం చేసి బసవ తత్వాన్ని, స్ఫూర్తిని పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్ర్ మంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా. బహుజన కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు గుమ్మడి రాజుల సాంబయ్య. రాష్ట్ర కాంగ్రెస్ ఓబిసి నాయకులు పులి గణేష్. దేవస్థానం ప్రధాన అర్చకులు దేవగిరి లక్ష్మన్న, శివాచార్య, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకట య్య, ఇమ్మడి దామోదర్, రాపాక విజయ్, సభ్యులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త: దీకొండ సంజీవ్ కుమార్

**రెబ్బెన, ఏప్రిల్ 20(జనంసాక్షి) :**బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్తగా, దళితుల పాలిట దేవుడిగా నిలిచారని వీరశైవ సంఘ నాయకులు దీకొండ సంజీవ్ కుమార్ అన్నారు.సోమవారం రెబ్బెన మండలంలోని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సంజీవ్ కుమార్ మాట్లాడుతూ బసవేశ్వరుడు 12వ శతాబ్దానికి చెందిన గొప్ప తత్వవేత్త అని తెలిపారు. కుల, మత, లింగ భేదాలు లేని సమాజం కోసం ఆయన పోరాడారని, స్త్రీలకు సమాన హక్కులు కల్పించారని పేర్కొన్నారు.అలాగే కల్యాణ చాళుక్యుల కాలంలో అనుభవ మంటపం ను స్థాపించి సామాజిక చర్చలకు వేదికగా నిలిపారని తెలిపారు. కాయకవే కైలాస అనే నినాదంతో కర్మయోగాన్ని బోధించిన మహానుభావుడని కొనియాడారు.అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్ర్ మంలో దీకొండ సాయి తేజ, ఒదు, మంజు,నవ్యతోపాటువిద్యార్థులుపాల్గొన్నారు

# మక్కలు పూర్తిగా కొనుగోలు చేయకుంటే ఉద్యమిస్తాం




**తొర్రూరు , ఏప్రిల్ 20 (జనం సాక్షి):**రైతులు పండించిన మొక్కజొన్నలను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని అఖిల భారతరైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల సాయన్న డిమాండ్ చేశారు. మొక్కజొన్నలను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఇనుగుర్తి మండల కేంద్రంలోని మక్కల కొనుగోలు కేంద్రంలో రైతులు నిరసన తెలిపారు. మొక్కజొన్నలు పూర్తిగా కొనడం లేదంటూ ఆరోపించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్నను ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయకపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. దళారులు క్వింటాల్ కు రూ.1800 నుంచి రూ.1900 మాత్రమే చెల్లించి మోసగిస్తున్నారన్నారు. రైతులు ఎకరాన 40 క్వింటాళ్ల వరకు మొక్కజొన్నలు పండిస్తే కేవలం 26 కింటాలు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం రూ.2400 కింటాకు మద్దతు ధర ఇస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. తొర్రూరు మండల వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ లోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, రైతుల సౌకర్యార్థం మరికొన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన మొక్కజొన్నలను పూర్తిగా కొనుగోలుచేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కుంచం బాబు, కొత్త రవి, గంజి కృష్ణారెడ్డి, చిన్నాల వెంకన్న, గోరెడ్ల వెంకన్న, చిన్నాల ఐలయ్య, నరెడ్ల బిక్షపతి, కొట్టం వెంకటరెడ్డి, గుగులోతు లక్ష్మీ, భూక్య రాములు, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లల్లో విద్యా నైపుణ్యాన్ని పెంచడమే అంగన్వాడీ కేంద్రాల లక్ష్యం



**మొగుళ్లపల్లి ఏప్రిల్ 20 జనం సాక్షి** చిన్నపిల్లల్లో విద్యా నైపుణ్యాన్ని పెంచడమే అంగన్వాడీ కేంద్రాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని అంగన్వాడీ సూపర్వైజర్ రజిత అన్నారు. సోమవారం మొగుళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆరేపల్లి, మొగుళ్లపల్లిలోని 4, 5 అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్స్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రీ స్కూల్ విద్యా ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల మెదడు పుట్టినప్పటి నుండి 5 సంవత్సరాలు పూర్తయ్యే వరకు 90 శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కాలంలోని పిల్లలకు ఎంత విద్య నేర్పితే అంత విద్యను నేర్చుకోగలుగుతారన్నారు. పిల్లల వయసుకు తగ్గ అభివృద్ధి మైలురాళ్లను అంచనావేసి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అసెస్మెంట్ కార్డ్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ టీచర్స్ పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను అందించి, ఇంటి వాతావరణాన్ని కల్పిస్తూ..పిల్లల యొక్క ఆలనా పాలన చూడాలన్నారు. రెండున్నర సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలు పూర్తయ్యే వరకు గ్రామాలలోని పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, తద్వారా పిల్లల అభివృద్ధిని అంచనావేసి, మంచి భవిష్యత్తుకు పునాదులు వేయడం అంగన్వాడీ కేంద్రాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాల టీచర్స్ బత్తిని స్వప్న, వెల్దండి వెన్నెల, మోటే రజిత, అంగన్వాడీ కేంద్రాల ఆయాలు, పిల్లల తల్లులు, పిల్లలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం బిఆర్ఎస్ నాయకులు



**పెద్దవంగర ఏప్రిల్ 20(జనం సాక్షి )** కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని సర్పంచ్ దంతాలపల్లి పర్శరాములు అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం వడ్డే కొత్తపల్లి గ్రామంలో ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారంతా గతంలో స్థానిక పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్కు అనుకూలంగా పనిచేసిన వారేనన్నారు. ఇప్పుడు వారు బీఆర్ఎస్ నుంచి వెళ్లినట్టు చూపిస్తూ కండువాలు కప్పుకోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. అలాంటి వారిని ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ రావు చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. వారు చేపట్టిన అభివృద్ధి పనులే గ్రామాల్లో కనిపిస్తున్నాయని, గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులు ఎక్కడా కనిపించడం లేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, అభివృద్ధి కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు రామరాజు, యాకన్న, మల్లేష్, శ్రీనివాస్, నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు

## కుబీర్ ఆశ్రమ పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ తనిఖీ

**కుబీర్, ఏప్రిల్ 20, (జనంసాక్షి):** కుబీర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి శంకర్ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యాబోధన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీలో భాగంగా ప్రత్యేక అధికారి నేరుగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పాఠాలు బోధిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి వారి విద్యా ప్రమాణాలను పరీక్షించారు. విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని రిజిస్టర్లు, స్టాక్ బుక్స్ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన, వంట గదిని, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని, ముఖ్యంగా కూరగాయలు, గుడ్లు నాణ్యంగా ఉండాలని వార్డెన్ను ఆదేశించారు. తాగునీటి సమస్యలు లేదా డార్మిటరీల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వండిన ఆహారం రుచిని స్వయంగా పరీక్షించారు. విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, పరిశుభ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ వహించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఇతర సిబ్బంది ఉన్నారు.



# ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



**నిర్మల్ రూరల్,ఏప్రిల్ 20(జనం సాక్షి)**జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా బసవేశ్వర చిత్రపటానికి అదనపు కలెక్టర్ లు, అధికారులతో కలిసి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ నాటి కాలంలోనే సమాజంలో అసమానతలను తొలగించి సమానత్వాన్ని సాధించేందుకు బసవేశ్వర మహారాజ్ ఎంతగానో కృషి చేశారని తెలిపారు.మహిళల హక్కుల కోసం, మహిళ వివక్షత నిర్మూలన కోసం పోరాడిన గొప్ప వ్యక్తి బసవేశ్వర మహారాజ్ అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ బసవేశ్వర మహారాజ్ అడుగుజాడల్లో నడవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్,,పలువురు సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.ప

## మానవత్వం చాటిన ఉపాధ్యాయులు మృతిచెందిన సీఆర్పీ కుటుంబానికి రూ.99 వేల ఆర్థిక సాయం



**బాసర, ఏప్రిల్ 20(జనం సాక్షి)** తోటి ఉద్యోగి కుటుంబానికి ఆపన్న హస్తం అందించి మానవత్వం చాటుకున్నారు బాసర మండల ఉపాధ్యాయులు. విధి నిర్వహణలో ఉండగానే అకాల మరణం చెందిన సీఆర్పీ భూమన్న కుటుంబానికి మొత్తం రూ.99 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు.ముధోల్ మండలం బోరేగాం గ్రామానికి చెందిన భూమన్న విద్యాశాఖలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)గా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న బాసర మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్పందించి తమవంతుగా రూ.84 వేలు సేకరించి ఆ మొత్తానికి ఫిక్స్డ్ డిపాజిట్ చేయించారు.సోమవారం మృతుని స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంఈఓ జి. మైసాజి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి రూ.84 వేల ఎఫ్డీ పత్రాన్ని అందజేశారు. అంతేకాకుండా, మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సైతం తమవంతు సాయంగా రూ.15 వేల నగదును బాధిత కుటుంబానికి అందించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మైసాజి మాట్లాడుతూ... "భూమన్న అకాల మరణం విద్యాశాఖకు తీరని లోటు. ఆయన కుటుంబానికి ఉపాధ్యాయ లోకం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. భవిష్యత్తులోనూ అన్ని విధాలా సహకారం అందిస్తాం" అని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజయ్య, ఉపాధ్యాయులు శ్రీరాములు, నరేందర్ రావు, రవీందర్, గంగా కిషన్, గోవిందరాజులు, భాస్కర్ రెడ్డి, హంస వాహిని పాఠశాల ప్రిన్సిపల్ ఓంకార్ దేశాయ్, సీఆర్పీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి చైర్మన్ డా.జి. సంధ్యారాణి



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 20 (జ నంసాక్షి):**రానున్న వర్షా కాలంలో డ్రైనేజి సమ స్యలు తలెత్త కుండా ముందస్తుగా చర్యలు తీసుకో వాలని మున్సిపల్ చైర్మన్ గోడిసెల సంధ్యారాణి-రాజా రమేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక 17వ వార్డులోని విద్యానగర్ లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో నిర్మించిన కాలువ శిథిలావస్తకు చేరడంతో మురుగు నీరు ఇండ్లలోకి చేరి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం కాలువలో పేరుకుపోయిన చేత్తా చేదారం, మురుగును తీసివేయాలని అధికారులకు సూచించారు. త్వరలోనే నూతన కాలువ నిర్మాణం చెపడతామని, అలాగే అన్ని వార్డులలో వర్షాకాల సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ ఎఈ అశ్రీత్, మాజీ కౌన్సిలర్ రామిడి ఉమాదేవి-కుమార్, మొగిలి, లక్ష్మి, సునీత, లక్ష్మీకాంత్, మణి తదితరులు ఉన్నారు

# కాళేశ్వరం ప్రాజెక్టులో దోషులను వదిలేది లేదు

- ప్రాజెక్టు పనులను వదిలేది లేదు
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టులో దోషులను వదిలేది లేదు.. ప్రాజెక్టు పనులను వదిలేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్ పూర్ మండలంలోని మేడిగడ్డ ప్రాజెక్టును మంత్రులు, జాతీయ డ్యాం సేఫ్టీ అధికారులతో కలిసి సోమవారం సందర్శించిన అనంతరం ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాలతో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయాలని 1975 లో జలగం వెంగళరావు ఆనాటి మహారాష్ట్ర సీఎంతో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఆ తర్వాత వైఎస్ హయాంలో 2009లో రూ. 38,063 కోట్లతో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మొదలు పెట్టి, ప్రాణహిత చేవెళ్లకు రూ.11,700 కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రాణహిత చేవేళ్లతో ఆర్థిక, రాజకీయ ప్రయోజనం లేదని భావించిన కేసీఆర్ రీడిజైనింగ్ పేరుతో పేరు, ఊరు అంచనాలు మార్చారని తెలిపారు. ప్రాజెక్టు అంచనాలను రూ. 1 లక్షా 50 వేల కోట్లకు పెంచారని, 2016 లో మొదలు పెట్టిన మేడిగడ్డను 2019 లో పూర్తిచేశామని, వారు ప్రారంభించడం జరిగిందన్నారు. ఇది అద్భుతమని భ్రమలు కల్పించి 2018 ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొందారని, 2023 లో మేడిగడ్డ కుంగిపోయిందన్నారు. అన్నిటిని దాచిపెట్టి 2023 ఎన్నికల్లో ప్రయోజనం పోందాలనుకున్నారని, దాచినా దాగని నిజాలను ప్రకృతి బయటపెట్టిందని తెలియజేశారు. ప్రాజెక్టులో సమస్యలు రాగానే 2023, నవంబర్ 1న ఎన్ డీఎస్ఏ ప్రాథమిక రిపోర్ట్ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఇచ్చిందని చెప్పారు. ఆ నివేదికను కేసీఆర్ పట్టించుకోలేదని, ఈ దోపిడీపై పీసీ ఘోష్ కమిటీ సంపూర్ణ నివేదిక ఇచ్చిందని తెలిపారు. దీనిపై మా రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రానికి తీర్మానం పంపించడం జరిగిందని అన్నారు. కేసీఆర్, హరీష్ ను జైల్లో వేయాలని, ఈ కేసును సీబీఐ కి అప్పగించాలని కిషన్ రెడ్డి ఆనాడు అన్నాడని, కానీ కేంద్ర ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. కాళేశ్వరంతో ఇప్పటి వరకు లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేకపోయారని, కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయాలని మా ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. నెల రోజుల ముందే అధికారులతో, సాంకేతిక నిపుణులతో చర్చించామని, ఇవాళ ఆ సమావేశం నిర్వహించుకున్నామని తెలిపారు. నిజాలు బయట పడతాయని తెలిసి, ఇవాళ కావాలని వాళ్లు పొలిటికల్ మీటింగ్ పెట్టుకున్నారని, అయినా మేం అనుమతులు ఇచ్చామని తెలియజేశారు.

కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తారని తెలిసి, బీజేపీ నేతల కాళ్లు పట్టుకునేందుకు హరీశ్ రావు ఢిల్లీకి పరుగెడుతున్నాడని తెలిపారు. మీడియా బయటపెట్టినా వాళ్లు దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదని, బీజేపీని అడ్డు పెట్టుకుని అవినీతి కేసుల నుంచి బయటపడతామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళతామని స్పష్టం చేశారు. హరీశ్ రావుకు తెలివి ఉండి మాట్లాడుతున్నాడో, తెలివి లేక మాట్లాడుతున్నాడో తెలియదు గాని, శ్రీపాద ఎల్లంపల్లి, ఈ ప్రాజెక్టుకు ప్రాణవాయువని, హరీష్ రావు నెక్కర్ వేసుకోకముందే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉందని, ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటితోనే రాష్ట్రంలో అత్యధిక పంటలు పండించారని తెలిపారు. కాళేశ్వరం విచారణపై సిబిఐ ఎందుకు మౌనంగా ఉంది? మేం పదే పదే లేఖలు రాసినా ఎందుకు స్పందిచడం లేదు? హరీష్ రహస్య పర్యటన వెనక మతలబు ఏంటో తెలంగాణ ప్రజలకు చెప్పాలని, ఢిల్లీలో ఎవరెవరిని కలిశారో హరీష్ బయటపెట్టాలని చెప్పారు. జడ్జిమెంట్ ప్రకటించకముందు వాదించడానికి వీలుండదని, మరి న్యాయవాదులను కలవడానికి వెళ్లాల్సిన అవసరం ఏముందన్నారు. కాళేశ్వరంలో దోషులను ఎప్పటికీ వదిలేది లేదని, దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు వెళతామని, ప్రాజెక్టును కూడా ఊరికే వదలమని, రిపేర్లు చేసి నీరు అందిస్తామని సీఎం చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే మా విధానం

జీవన్‌రెడ్డి చెప్పాలని, పేదలకు సన్నబియ్యం ఇస్తున్నందుకా, 4.5 లక్షల ఇళ్లు ఇచ్చినందుకా.. అని ఎద్దేవా చేశారు. మరి కేసీఆర్ పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చాడా, 20 లక్షలకోట్లు ఖర్చుచేసి 20 వేల ఇళ్లుకూడా కట్టలేదని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడీలకు ఊడిగం చేయాలా అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా పాలన పోవాలి పాపాల భైరవుడు రావాలని ఓ పెద్దమనిషి అంటున్నాడని, ఫామ్ హౌస్ లో పడుకునే పాపాల భైరవుడు మళ్ళీ ఎందుకు రావాలి, లక్షలాదిమంది కార్యకర్తలు రక్తాన్ని చెమటగా మార్చి భుజాలు కాయలు కాసేలా జెండాలు మోస్తే ప్రభుత్వం వచ్చింది, పాపాల భైరవుడు ఎందుకు రావాలో పార్టీ మారుతున్న పెద్దమనిషి చెప్పాలన్నారు. జీవన్ రెడ్డి చరిత్ర ఆయన వెనకున్న మచ్చలు నాకు తెలుసు గతంలో ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచి నాదెండ్ల భాస్కర్ రెడ్డి, వెంట వెళ్లిపోయారని, 14 సార్లు కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇస్తే గెలిచి పదవులు అనుభవించిన పెద్దమనిషి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసి పార్టీ మారుతున్నాడని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఇదే నా సవాల్ కేసీఆర్ 2029 లో నువ్వో నేనో,చూసుకుందాం అని సీఎం రేవంత్ రెడ్డి సవాలు విసిరారు. గత విడతలో రైతు భరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు జమ చేశామ న్నారు. ఇవాళ రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని, మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో జమ చేస్తామన్నారు. రాష్ట్రంలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామని, పేదలకు సన్న బియ్యం అందించాలనే ఆలోచన ఎవరికైనా వచ్చిందా? అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలను అడ్డుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం ఆరోపించారు. అంతకు ముందు ఆరెంద-దామెరకుంట గ్రామాల మధ్య మానేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సిఎం శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, గడ్డం వివేక్, ధనసరి అనసూయ సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లా ఉన్నత విద్యారంగంపై నిర్లక్ష్యం వీడాలి

వస్తోందని వివరించారు.బాసర ట్రిపుల్ ఐటీలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి మూడు నెలలు గడిచినా, క్షేత్రస్థాయిలో ఎటువంటి అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులతో తక్షణమే సమీక్ష నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలనీ కోరారు. ఈ అంశంపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని సయ్యద్ హైదర్ హెచ్చరించారు.

# ప్రజల కోసం సర్పంచ్ మార్నింగ్ వాక్



**తాండూర్, ఏప్రిల్ 20(జనం సాక్షి) :** మండలంలో మాదారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ప్రజలకు చేరువయ్యేలా మార్నింగ్ వాక్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు గ్రామ ప్రజల సమస్యలను పరిష్కారించడానికి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందుతున్నాయో లేవో తెలుసుకోవడానికి మార్నింగ్ వాక్ అనే కార్యక్రమాన్ని సోమవారం రోజున ఉదయం 8 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారితో పటు పంచాయతీ సెక్రెటరీ అల్లావుద్దీన్ వార్డు సభ్యులు బానేష్ , రవి, స్థానిక కాంగ్రెస్ నాయకులు రమేష్ పుప్పాల శ్రీనివాస్ నారా సంజీవ్ పెట్టాం బీమేష్ అసంపల్లి శ్రీనివాస్ మళ్ళిడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్న డా.తాళ్ళ అజయ్



**చెన్నారావుపేట, ఏప్రిల్ 20 (జనంసాక్షి) :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు - 2026 సంవత్సరమునకు గాను చెన్నారావుపేట రాజీవ్ నగర్ కు చెందిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేత, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫౌండర్, స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ తాళ్ళ అజయ్ అందుకున్నారు. ఏప్రిల్ 19వ తేదిన హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య ఆకాడమి 9వ తెలంగాణ స్టేట్ కాన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య ఆకాడమి జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ ఎస్సీ, ఎస్టి, బిసి, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి యేటా ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డులను అందజేస్తునట్లు తెలిపారు. విద్యార్థి నాయకుడిగా అంబేద్కర్ భావజాలంతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీల చైతన్యం కోసం కృషి చేస్తున్న డా.తాళ్ళ అజయ్ కు ఈ అవార్డు అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా తాళ్ల అజయ్ మాట్లాడుతూ నేషనల్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని ఈ అవార్డు అందజేసినందుకు బహుజన సాహిత్య అకాడమీ బాధ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటి సభ్యులు తాటికంటి ఐలయ్య, బాదె వెంకటేషం, బొమ్మకంటి రాజేందర్, అకెపోగు ప్రమోద్ మహరాజ్, ప్రవీణ్, మనోజ్ , శివాజీ, పాల్గొన్నారు.

# తెలంగాణను అవహేళన చేస్తే సహించేది

- జిల్లా ప్రదాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్



**మల్హార్,ఏప్రిల్ 20(జనంసాక్షి) :** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమని, అవి తెలంగాణ సమాజాన్ని కించపరిచేలా ఉన్నాయని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ముడితనపల్లి ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మండల కేంద్రమైన తాడిచెర్ల లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ .. వేలాది మంది అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల పోరాట ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంపై అవగాహన లేకుండా మాట్లాడటం తేజస్వి సూర్య అజ్ఞానానికి నిదర్శన మని మండిపడ్డారు. తక్షణమే తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు జిల్లా అధికార ప్రతినిధి బోయిని రాజయ్య యాదవ్, బూడిద సతీష్, అవిర్నేని పురుషోత్తం రావు, చొప్పరి రాజు, షేక్ చాంద్ పాష, కోట నవీన్, తోకల గట్టయ్య, ఆకుల సదానందంతో పాటు పలువురు మహిళా ఉద్యమ నాయకురాళ్లు పాల్గొన్నారు.

# బమ్మెరలో బడిబాట.. విద్యార్థులతో ర్యాలీ



**పాలకుర్తి, ఏప్రిల్ 20(జనంసాక్షి) :** మండలంలోని బమ్మెర జెడ్పీ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయలు, విద్యార్థులు బడిబాట కార్యక్రమంలో బాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతిలో బ్యానర్ చేత పట్టుకొని గ్రామంలోని వీధులన్నీ కలియ తిరిగారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయుడు మల్లారెడ్డి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరగానే ఉచిత పాఠ్య పుస్తకాలు అందచేయడంతో పాటు రెండు జతల దుస్తులు, నాణ్యమైన మధ్యహ్న భోజనం, వచ్చే విద్యా సంవత్సరం నుంచి బ్రేక్ఫాస్ట్, నిరంతరం సమగ్ర మూల్యాంకనం, విద్యార్థులపై వ్యక్తి గత శ్రద్ధతో పాటు పాఠశాలలో చదువుతో పాటు నైతిక విలువలు కూడా విద్యార్థులకు చెప్పడంతో ఇంగ్లీష్ మీడియం విద్యాబోధన అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నర్సింహస్వామి, స్వామి, లావణ్యా కుమారి, నూర్జహాన్ బేగం. నాయకులు రాపాక సత్యనారాయణ, ఉప సర్పంచు బత్తిని సురేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**సారంగాపూర్,ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా, సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత, పాఠశాల పరిశుభ్రతపై అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ తనిఖీ జరిగింది.

# ఆదివాసుల భూ సమస్యలను పరిష్కరించాలి

- **ప్రజాదర్బార్ లో కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన గోండ్వాన సంక్షేమ పరిషత్**



**ఏటూరునాగారం, ఏప్రిల్ 20(జనంసాక్షి) :** ఏజెన్సీ ప్రాంతంలో ఏండ్ల తరబడి ఆదివాసులు భూములను సాగు చేస్తూ ఉన్నప్పటికీ వాళ్లకి ఎలాంటి హక్కు కల్పించడం లేదని అధికారులపై గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మండిపడ్డారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం నందు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ చేయడం జరిగింది. ఈ సంధర్భంగా గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ కలెక్టర్ దివాకర్ ను కలసి ఏజెన్సీ ప్రాంత భూ సమస్యలపై మెమోరండం ఇవ్వడం జరిగింది. అనంతరం జీవిస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ, వెంకటాపురం మండలం కొమరం భీం కాలనీ ఆదివాసులు ఏళ్ల తరబడి భూమిని సాగు చేస్తున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు ఆదివాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఈ భూమిపై గిరిజనేతరులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన వాళ్లని ఎదుర్కొని ఈనాడు ఆ భూమిని సాగు చేసే క్రమంలో ఫారెస్ట్ అధికారులు ఇది మా భూమి అంటూ చెప్పడం విడ్డూరం అన్నారు. వాడగూడెం (జి)సర్వే నెంబర్ 27లో దాదాపు 140 ఎకరాలు రెవిన్యూ భూమి ఉన్నప్పటికీ,ఆ భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. అదే సర్వే నెంబరు 27 భూమిలో గిరిజనేతరులకు పహాణి రికార్డులు ఎంటర్ చేస్తుంటే ఫారెస్ట్ అధికారులు దిక్కులు చూస్తున్నారా.. అని ఆయన మండి పడ్డారు. ఫారెస్ట్ భూములలో అనేకమంది గిరిజనేతరులు అక్రమ పట్టాలు పొందుతుంటే చోద్యం చూస్తున్నారు తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తేల్చి చెప్పాలని సవాల్ చేశారు. కొమరం భీం కాలనీ ఆదివాసుల భూ సమస్యపై ఫారెస్ట్ అధికారుల వైఖరి మార్చుకోకపోతే త్వరలో ఫారెస్ట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఆదివాసికి సాగు చేసే హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తురస చంటి, కొమరం భీం కాలనీ ఆదివాసులు రమేష్, సంతోష్, లక్ష్మయ్య, రాజేష్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరణ



**వరంగల్ ఎం జీఎం, ఏప్రిల్ 20(జనంసాక్షి):** సోమవారం జీ డబ్ల్యూ ఎం సి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో గ్రీవెన్స్ (ప్రజావాణి) కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఆయా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారీగా టౌన్ ప్లానింగ్ 46 ఇంజనీరింగ్ 33 రెవిన్యూ 18 హెల్త్ అండ్ శానిటేషన్ 5 హార్టికల్చర్ 2 మొత్తంగా 104 వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, పన్నుల అధికారి రామకృష్ణ, ఎం హెచ్ ఓ డా.రాజేష్, హెచ్ ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి



**ఖానాపూర్ ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** పట్టణంలోని జేకే నగర్ కాలనీకి చెందిన ఏనుగుల రాజేశ్వర్ (54) పాముకాటుతో మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఆదివారం మధ్య రాత్రి అనంతరం పాముకాటుకు గురి కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని పరిస్థితి విషమించడంతో ఉన్నత వైద్యం కొరకు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు పేర్కొన్నారు.

## బాల కార్మికులను బడిలో చేర్పించాలని గ్రామంలో భారీ ర్యాలీ

- **ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న**



**గూడూరు, ఏప్రిల్20 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మచ్చర్ల జిపిఎస్ బేతంచర్ల పాఠశాలలో ఈనెల 20 నుంచి 26వరకు జరిగే ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి గ్రామంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తుగానే బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని,బడి ఈడు పిల్లలను,బాల కార్మికులను బడిలో చేర్పించాలని విద్యార్థులతో కలసి భారీ ఎత్తున గ్రామంలో ర్యాలీ నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న, ఉపాధ్యాయులు రేగ సాంబయ్య,సుంచ లక్ష్మయ్య, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్వతగిరిలో రాజకీయ రీ-అలైన్‌మెంట్

- **మేడిశెట్టి రాములు నిర్ణయం వెనుక వ్యూహం ఏమిటి?**
- **అతని వెంట మేము సైతం అతని అనుచరులు**
- **మండల కేంద్రంలో ఖాళీ అవుతున్న టిఆర్ఎస్**

**పర్వతగిరి, ఏప్రిల్ 20 ( జనం సాక్షి) :** పర్వతగిరి మండల రాజకీయాల్లో మేడిశెట్టి రాములు తీసుకున్న తాజా నిర్ణయం సాధారణ పార్టీ మార్పు కాదని, దీని వెనుక స్పష్టమైన రాజకీయ వ్యూహం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక స్థాయిలో బలమైన కేడర్, వ్యక్తిగత ఓటు బ్యాంక్ కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన రాములు, మారుతున్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ముందడుగు వేసినట్లు తెలుస్తోంది. టిడిపి నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం, తరువాత టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్)లో కొనసాగింది. అయితే బీఆర్ఎస్‌లో స్థానిక స్థాయిలో ఏర్పడ్డ విభేదాలు, ప్రాధాన్యత లోపం వంటి అంశాలు ఆయనను అసంతృప్తికి గురిచేసినట్లు సమాచారం. ముఖ్యంగా నాయకత్వ మార్పులు, కొత్త సమీకరణాలు ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపినట్లు భావిస్తున్నారు.ఇక రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వైపు ఆయన మొగ్గు చూపడం వెనుక స్పష్టమైన లెక్కలు ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అధికార పార్టీలో చేరడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు అనుసంధానం అవ్వడం, తన అనుచర వర్గాన్ని బలోపేతం చేయడం, భవిష్యత్తు ఎన్నికల్లో బలమైన స్థానం సంపాదించడం లక్ష్యంగా కనిపిస్తోంది.రాములు కాంగ్రెస్‌లో చేరడం ద్వారా పర్వతగిరి మండలంలో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన స్థానిక నేతలపై ఒత్తిడి పెరగవచ్చు. అలాగే కాంగ్రెస్ పార్టీకి గ్రామస్థాయిలో బలమైన కేడర్ లభించే అవకాశముంది.అదే సమయంలో, రాములు పదవులపై ఆశ లేకుండా ప్రజాసేవకే ప్రాధాన్యత ఇస్తానని ప్రకటించడం కూడా ఒక రాజకీయ సందేశంగా భావిస్తున్నారు. ఇది ప్రజల్లో సానుకూల ప్రతిస్పందన పొందడమే కాకుండా, తనపై ఉన్న విశ్వాసాన్ని మరింత పెంచే ప్రయత్నంగా విశ్లేషిస్తున్నారు.మొత్తంగా చూస్తే, మేడిశెట్టి రాములు తీసుకున్న ఈ నిర్ణయం పర్వతగిరి మండల రాజకీయాల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని, రాబోయే ఎన్నికల సమీకరణాలపై కూడా దీని ప్రభావం పడవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, ఏప్రిల్ 20(జనంసాక్షి) :** పాలకుర్తి, కొడకండ్ల మండలాలకు చెందిన లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి మండలానికి చెం దిన 24 మంది లబ్దిదారులకు రూ.24 లక్షల 2 వేల 784 కొడకండ్ల మండలానికి చెందిన 26 మంది లబ్దిదారులకు రూ.26 లక్షల 03 వేల 16 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పం తో కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ లాంటి పథకాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, సురేష్ నాయక్, వీరమనేని యాకాంతరావు, ఎర్రబెల్లి రాఘవరావు, బండపెల్లి వెంకన్న. సురేష్ నాయక్. జలగం కుమార్. ఎండి మదర్. మేడారపు సుధాకర్. బండిపెల్లి మనమ్మ. తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**ఖానాపూర్ ఏప్రిల్ 20(జనం సాక్షి) :** మండలంలోని ఇక్బాల్ పూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం ప్రారంభించారు. సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంపీఓ రత్నాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## అడవులు కాపాడితేనే భవిష్యత్ భద్రం

**కొత్తూరులో అవగాహన సదస్సు**



**నెన్నెల్, ఏప్రిల్ 20( జనం సాక్షి) :** కొత్తూరు గ్రామంలో ఫారెస్ట్ అధికారులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సదస్సులో మాట్లాడిన అధికారులు ఎండాకాలంలో అడవికి వెళ్లే వారు, ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు, మేకల కాపరులు అడవిలో ఎట్టి పరిస్థితుల్లోనూ అగ్గి వేయకూడదని, చెట్లను నరకకూడదని సూచించారు. అడవులు పెరిగితే వర్షపాతం మెరుగుపడుతుందని, పంటలు బాగా పండుతాయని తెలిపారు. చెట్లు ఆక్సిజన్ విడుదల చేయడం వల్ల ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అడవులను సంరక్షించి, పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలండి రాజేశ్వరి పోషమల్లు, ఉప సర్పంచ్ బోయిని పోషం, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## నేడు మంగపేటలో ప్రజా దర్బార్

**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 20(జనంసాక్షి) :** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగపేట మండలం మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు, మంగపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో మంగపేట మండలంలోని మల్లూరు, మంగపేట గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. జిల్లా ఎస్పీ, డిఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు హాజరు కావాలని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో నూతన ఉత్సాహం

- డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్‌కు ఘన సన్మానం
- పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తా అన్న రమేష్ : శాలువా కప్పి అభినందించిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్

బాసర, ఏప్రిల్ 20 (జనం సాక్షి) నిర్మల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. తాజాగా డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన సీనియర్ నేత మమ్మాయి రమేష్‌ను ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ సోమవారం ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నారాయణరావు పటేల్ స్వయంగా రమేష్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... "ముధోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడడంలో మమ్మాయి రమేష్ చేస్తున్న కృషి అమోఘం. కార్యకర్తలకు, నాయకులకు మధ్య వారధిగా ఉంటూ పార్టీని నడిపిస్తున్న తీరును గుర్తించే అధిష్టానం ఆయనకు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించింది" అని కొనియాడారు.

**పార్టీ నమ్మకాన్ని నిలబెడతా - మమ్మాయి రమేష్**

సన్మానానికి స్పందించిన డీసీసీ ఉపాధ్యక్షుడు మమ్మాయి రమేష్, తనపై నమ్మకం ఉంచి పదవి కల్పించిన పార్టీ అధిష్టానానికి, సన్మానించిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "నియోజకవర్గంలో ప్రతి గడపకు కాంగ్రెస్ పార్టీ విధానాలను తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రథమ కర్తవ్యం. పార్టీ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు శక్తివంచన



లేకుండా కృషి చేస్తాను" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ఉపాధ్యక్షుడు రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నియామకంతో నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల్లో నూతన జోష్ వచ్చిందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

## నర్సంపేటలో వేసవి జాగ్రత్తలు పాటించాలి



**టౌన్ సీఐ ముస్క శ్రీనివాస్ విజ్ఞప్తి**

నర్సంపేట ఏప్రిల్ 20 (జనం సాక్షి) : నర్సంపేట టౌన్ మరియు మండలంలోని గ్రామ ప్రజలకు పోలీసు శాఖ ముఖ్య విజ్ఞప్తి చేసింది. ఎండాకాలంలో స్కూల్, కాలేజీ సెలవులు ఉన్న నేపథ్యంలో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నర్సంపేట టౌన్ సీఐ ముస్క శ్రీనివాస్ సూచించారు. పిల్లలను చెరువులు, కాలువలు లేదా ఇతర ప్రమాదకర ప్రదేశాల్లో ఈతకు పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే, పిల్లలు బయట ఎక్కువసేపు తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా చూడాలని తెలిపారు. ఎండా కాలంలో దొంగతనాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. విహార, తీర్థయాత్రలకు, ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు చుక్కుపక్కల వారితో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే ఇండ్ల వద్ద రాత్రి వేళ్లలో లైట్లు వేసి ఉంచాలని అన్నారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తమ ఇళ్ల భద్రతపై శ్రద్ధ వహించి పోలీస్ స్టేషన్ నంబర్ 8712685021 కు సంచారం ఇవ్వాలని నర్సంపేట టౌన్ సీఐ ముస్క శ్రీనివాస్ తెలిపారు.

## షేక్ ముజాహికు కో ఆప్షన్ మెంబర్ ఇవ్వాలి



సారంగాపూర్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) : కాంగ్రెస్ పార్టీలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న 7 ,8 వార్డు లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పించడం చేయించడం జరిగింది. ఎమ్మెల్యే ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలిపించి మీకు కోప్షన్ నెంబర్ ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది కావున తమ మాటను నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ కమిటీని కోరుతున్నాను అని తెలిపారు. సమాజీక సేవకులను గుర్తించి ప్రజలకు ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తున్న షేక్ ముజాహిద్ కి మెంబర్ ఇవ్వాలని కాంగ్రెస్ కమిటీతో కోరడం జరిగింది.

## ఆదివాసీల భూ సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాదర్బార్ లో కలెక్టర్ దివాకర టిఎస్‌కు వినతి పత్రం అందజేసిన గొండ్వాన సంక్షేమ పరిషత్**

నూగూర్ వెంకటాపురం ఏప్రిల్ 20(జనం సాక్షి ): ఏజెన్సీ ప్రాంతంలో ఏండ్ల తరబడి ఆదివాసులు భూములను సాగు చేస్తూ ఉన్నప్పటికీ వాళ్లకి ఎలాంటి హక్కు కల్పించడం లేదని అధికారులపై గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మండిపడ్డారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం నందు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు . ఈ సంధర్బంగా గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి,ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ కలెక్టర్ దివాకర టి ఎస్ ను కలసి ఏజెన్సీ ప్రాంత భూ సమస్యలపై మెమోరండం అందజేశారు .అనంతరం జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ. వెంకటాపురం మండలం కొమరం భీం కాలనీ ఆదివాసులు ఏళ్ల తరబడి భూమిని తాగు చేస్తున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు ఆదివాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఈ భూమిపై గిరిజనేతరులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన వాళ్లని ఎదుర్కొని ఈనాడు ఆ భూమిని సాగు చేసే క్రమంలో ఫారెస్ట్ అధికారులు ఇది మా భూమి అంటూ చెప్పడం విడ్డూరం అన్నారు. వాడగూడెం (జి)సర్వే నెంబర్ 27 లో దాదాపు 140 ఎకరాలు రెవిన్యూ భూమి ఉన్నప్పటికీ,ఆ భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం



చేసుకోవడంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని ఆయన ఎద్దేవ చేశారు. అదే సర్వే నెంబరు 27 భూమిలో గిరిజనేతరులకు పహాని రికార్డులు ఎంటర్ చేస్తుంటే ఫారెస్ట్ అధికారులు దిక్కులు చూస్తున్నారా..అని ఆయన మండి పడ్డారు. ఫారెస్ట్ భూములలో అనేకమంది గిరిజనేతరులు అక్రమ పట్టాలు పొందుతుంటే చోద్యం చూస్తున్నారు,తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తేల్చి చెప్పాలని సవాల్ చేశారు. కొమరం భీం కాలనీ ఆదివాసుల భూ సమస్యపై ఫారెస్ట్ అధికారుల వైఖరి మార్చుకోకపోతే త్వరలో ఫారెస్ట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఆదివాసికి సాగు చేసే హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ని కోరారు . ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు తురస చంటి,కొమరం భీం కాలనీ ఆదివాసులు రమేష్,సంతోష్,లక్ష్మయ్య,రాజేష్,భీమయ్య,తదితరులు పాల్గొన్నారు.

## జియో టవర్ ఏర్పాటు కోసం భూదానం



నెరడిగొండ, ఏప్రిల్ 20 (జనం సాక్షి) : మండలం లోని వాగ్దరి గ్రామ పంచాయతీ పరిధి లోని ఆయా గ్రామాల్లో జియో టవర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్న గ్రామ ప్రజలకు ఎట్టకేలకు శుభవార్త అందింది. గ్రామంలో మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఉద్యోగులు వ్యాపారులు అనేక కష్టాలు పడుతున్న నేపథ్యంలో వాగ్దరి గ్రామ సర్పంచ్ జాదవ్ విజయ్ కుమార్ ఈ సమస్యను పట్టించుకుని జియో సంస్థ ప్రతినిధులను సంప్రదించారు. ఈ సందర్భంగా జియో సంస్థ అధికారులు భూమి అందుబాటులో ఉంటే టవర్ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సోమవారం దీనిపై స్పందించిన మాదాపూర్ గ్రామానికి చెందిన ఓ దాత సోయం ఆకాష్ తండ్రి భీంరావు ముందుకు వచ్చి,గ్రామ అభివృద్ధి దృష్ట్యా తన భూమిని టవర్ నిర్మాణానికి దానం చేస్తూ రెవెన్యూ అధికారి తహసీల్దార్ కలీమ్,ఆర్ఐ నాగోరావు సమక్షంలో లిఖిత పూర్వకంగా అందజేశారు. ఈ చర్యతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, దాతను సర్పంచ్‌ను అభినందించారు. త్వరలోనే జియో టవర్ ఏర్పాటు అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన నెట్‌వర్క్ సౌకర్యం అందించడం తమ బాధ్యతగా భావించి ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. భూమి దానం చేసిన వ్యక్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జియో టవర్ ఏర్పాటుతో విద్య ఉపాధి అత్యవసర సేవలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోయం లక్ష్మన్ గ్రామస్తులు ఉన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ

**తాండూర్ తహశీల్దార్ జ్యోత్న**



తాండూర్, ఏప్రిల్ 20(జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా :బెల్లంపల్లి నియోజవర్గం తాండూర్ మండలంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ)ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా తాండూర్ తహశీల్దార్ జ్యోత్న సోమవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని స్వయంగా తిని రుచి చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కల్పన, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దు

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్ రూరల్,ఏప్రిల్20(జనం సాక్షి) : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య,వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు,భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అధికారి సంక్షేమ వసతి గృహాల్లో నిర్వహించే సంక్షేమ వారోత్సవాల్లో పాల్గొనాలని తెలిపారు. అనంతరం ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ డే-2026 కు సంబంధించి వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన చట్టాలపై శిక్షణ సదస్సు..

**జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిడి దేశీరాం నాయక్..**

మహబూబాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 20 (జనం సాక్షి): ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఐటిడిఏ ), ఏటూరునాగారం ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో గిరిజన చట్టాలపై గిరిజన సంస్థలు మరియు సంబంధిత అధికారులకు అవగాహన కల్పించుటకు సమావేశం-తోడు శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 25వ తేదీ ఉదయం 11.00 గంటలకు ములుగు కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించ నున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దేశీరాం నాయక్ తెలిపారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్ ), పంచాయతీరాజ్ విస్తరణ చట్టం (పేసా), భూసంపద బదిలీ నియంత్రణ చట్టం (ఎల్ టిఆర్) తోపాటు ఇతర ఏజెన్సీ చట్టాల అమలుపై వివరణ ఇవ్వబడుతుంది.